AKSHARA TODAY


అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

WWW.AKSHARATODAYNEWS.COM

12-9-2026 (Saturday) | MAIN EDITION

## డిసెంబర్ దర్శన కోటా విడుదల వివరాలు



**అక్షరటుడే, ఏపీ :** తిరుమల శ్రీవారిని దర్శించుకునే భక్తులకు టీటీడీ కీలక వార్త చెప్పింది. డిసెంబర్ నెలకు సంబంధించి దర్శన కోటా ఆన్‌లైన్ బుకింగ్ వివరాలను తాజాగా వెల్లడించింది. శ్రీవారి ఆర్జిత సేవా టికెట్లకు సంబంధించిన డిసెంబర్ కోటాను సెప్టెంబర్ 19న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఈ సేవా టికెట్లు ఎలక్ట్రానిక్ డిప్ కోసం 21వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవ టికెట్లను 22న ఉదయం 10 గంటలకు విడుదల చేస్తారు.

## తెలంగాణ భవన్‌లో మాక్ అసెంబ్లీ



**అక్షరటుడే, హైదరాబాద్ :** బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మాక్ అసెంబ్లీ నిర్వహించారు. తమను అసెంబ్లీ సమావేశాల నుంచి సస్పెండ్ చేయడంతో తెలంగాణ భవన్ వేదికగా శనివారం మాక్ అసెంబ్లీ నిర్వహించారు. సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ సీఎంగా, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు స్పీకర్‌గా వ్యవహరించారు. మంత్రులుగా కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ పాలనపై మాక్ అసెంబ్లీలో సెటైర్లు వేశారు.

## ఢీ–10 విన్నర్ రాజుపై కేసు



అక్షరటుడే, సినిమాడెస్క్ : ఢీ-10 రియాల్టీ షో విన్నర్ రాజుపై కేసు నమోదు అయింది. తనను లైంగికంగా వేధించాడంటూ యువతి అతడిపై ఫిర్యాదు చేసింది. దీంతో రాజుపై మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

## రేవంత్ రెడ్డి బ్లాక్ మెయిలర్ల సంఘం అధ్యక్షుడు : కవిత



అక్షరటుడే, హైదరాబాద్ : సీఎం రేవంత్‌రెడ్డి బ్లాక్ మెయిలర్ల సంఘం అధ్యక్షుడని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. అసెంబ్లీలో ప్రజా సమస్యలు చర్చిస్తారనుకుంటే... అసెంబ్లీ ఆవరణలో అధికార, ప్రతిపక్షాలు బాహాబాహీకి దిగి తిట్టుకున్నాయన్నారు.

## భూ సేకరణ పూర్తయింది : మంత్రి కోమటిరెడ్డి



అక్షరటుడే, హైదరాబాద్ సిటీ : తెలంగాణ మీదుగా 280 కి.మీ మేర సాగే అత్యంత కీలకమైన నాగ్‌పూర్-విజయవాడ (మంచిర్యాల, వరంగల్, ఖమ్మం మీదుగా) గ్రీన్‌ఫీల్డ్ హైవే భూసేకరణ ప్రక్రియ దాదాపు పూర్తయిందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన అసెంబ్లీలో మాట్లాడారు.

**అపోలో ఆస్పత్రి యాజమాన్యానికి రాష్ట్ర వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ రూ.43 లక్షల జరిమానా విధించింది. 2013లో పక్షవాతానికి గురైన 53 ఏళ్ల రోగి మరణం విషయంలో జూబ్లీ హిల్స్‌లోని అపోలో హాస్పిటల్ నిర్లక్ష్యం ఉందని కమిషన్ నిర్ధారించింది. మొత్తం రూ. కోటి నష్టపరిహారం కోరుతూ రోగి భార్య, కుమారుడు, కుమార్తె దాఖలు చేసిన ఫిర్యాదును కమిషన్ పాక్షికంగా అనుమతించింది.**

- అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి




# అపోలో ఆస్పత్రికి రూ. 43 లక్షల ఫైన్

- గోల్డెన్ అవర్ వృథా చేసినందుకు..
- వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ తీర్పు
- రోగి రికార్డుల నిర్వహణలోపంపై ఆగ్రహం

వారాసిగూడలోని తన ఇంట్లో ఎన్. దేవేందర్ రావు అనే వ్యక్తికి 2013 మార్చి 22న పక్షవాతం వచ్చింది. అదే రోజు కుటుంబ సభ్యులు ఆయనను అపోలో సికింద్రాబాద్ శాఖకు తరలించారు. అక్కడి సిబ్బంది, న్యూరాలజిస్ట్ అందుబాటులో లేరని చెప్పి, అతడిని జూబ్లీహిల్స్ బ్రాంచ్‌కు పంపారు. స్ట్రోక్ వచ్చిన తర్వాత మొదటి గంటను 'గోల్డెన్ అవర్' అంటారు. ఆ సమయంలో చికిత్స ఉత్తమంగా పనిచేస్తుంది. అయితే రోగికి సరైన చికిత్స అందించడంలో అపోలో ఆ గంటను వృథా చేసిందని కమిషన్ గుర్తించింది. దీంతో వైద్య నిర్లక్ష్యానికి రూ. 40,11,876, ఆస్తి నష్టానికి రూ. లక్ష, రికార్డుల నిర్వహణ లోపానికి రూ. లక్ష, తండ్రి ప్రేమ కోల్పోయినందుకు రూ. లక్ష చొప్పున చెల్లించాలని అపోలను ఆదేశించింది. వ్యాజ్యపు ఖర్చులు అదనం రూ. 25 వేలు ఇవ్వాలని పేర్కొంది.

### తప్పుడు సమాచారం

అపోలో యాజమాన్యం తప్పుడు సమాచారం ఇచ్చిందని కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. తాము సికింద్రాబాద్ అపోలకు మధ్యాహ్నం 1:30 గంటల నుంచి 2 గంటల మధ్య వచ్చామని కుటుంబ సభ్యులు చెప్పారు. అయితే ఆస్పత్రి వారు మాత్రం మధ్యాహ్నం 3:15కు వచ్చినట్లు చెప్పారు. మానవ హక్కుల కమిషన్‌కు సమర్పించిన రిపోర్టులో మరో సమయం ఇచ్చారు. ఆసుపత్రి బిల్లుల ప్రకారం సికింద్రాబాద్‌లో సాయంత్రం 4 గంటలకల్లా పరీక్షలు జరిగినట్లు కమిషన్ గుర్తించింది. జూబ్లీహిల్స్‌లోని రికార్డు ప్రకారం రోగి సాయంత్రం 6:42 గంటలకు మాత్రమే ఆసుపత్రిలో చేరినట్లు చూపించారు. కొన్ని నర్సింగ్ నోట్స్‌లో ఆ అడ్మిషన్ సమయానికి ముందే రీడింగ్‌లు నమోదు చేసినట్లు కమిషన్ గుర్తించింది. దీంతో తప్పుడు సమాచారం ఇచ్చినట్లు కమిషన్ గుర్తించింది.

### రికార్డులు సమర్పించని ఆస్పత్రి

రోజువారీగా రోగికి ఏమి జరిగిందో రికార్డుల నిర్వహణ కూడా సక్రమంగా లేదు. రోగి ఆసుపత్రిలో చేరినప్పటి నుండి దాదాపు ఏడు నెలల తర్వాత మరణించాడు. పూర్తి కాలానికి సంబంధించిన అసలు రికార్డులను అపోలో సమర్పించలేదు. 2013 మార్చి చివరి నుంచి అక్టోబర్ మధ్య వరకు.. రోగి ఆసుపత్రిలో ఉన్న ఏడు నెలల కాలానికి సంబంధించిన రికార్డులు ఏవీ కమిషన్‌కు లభించలేదు. దీంతో యాజమాన్యానికి రూ. 43 జరిమానా విధించింది.

## ఇదేనా ప్రజా పాలన : హరీశ్‌రావు



**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ :** రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లలో 20-25 ఏళ్లుగా సేవలందిస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాల్లో కోత విధించడం దుర్మార్గమని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన జీవో మున్సిపల్ ఉద్యోగుల పాలిట శాపంగా మారిందన్నారు. ఇన్నేళ్లుగా ప్రభుత్వ వ్యవస్థలో భాగంగా పనిచేస్తున్న ఉద్యోగుల సేవలు, అనుభవాన్ని గుర్తించాల్సింది పోయి.. కొత్త నిబంధనల పేరుతో జీతాలు తగ్గించడం అన్యాయమని ఆయన పేర్కొన్నారు. ఈ నిర్ణయం 31 వేల ఉద్యోగుల కుటుంబాలపై తీవ్ర ఆర్థిక భారం మోపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ హయాంలో వేతనాల పెంపు ఉంటే.. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో వేతనాల్లో కోతలు అమలు చేస్తున్నారని విమర్శించారు.

## భవిష్యత్ కోసమే క్యూర్ చట్టం : శ్రీధర్‌బాబు



**అక్షరటుడే, హైదరాబాద్ :** భవిష్యత్ అవసరాల కోసమే నూతన ‘క్యూర్’ చట్టం తీసుకొచ్చినట్లు మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. 1955 నాటి చట్టం స్థానంలో, 2047 నాటి హైదరాబాద్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని నూతన 'క్యూర్' (CURE) చట్టాన్ని తెచ్చామన్నారు. మంత్రి శ్రీధర్‌బాబు శనివారం అసెంబ్లీలో మాట్లాడారు. క్యూర్ చట్టంతో పాటు విపత్తుల నిర్మూలనకు కొత్త చట్టం తెస్తామని తెలిపారు. వరదలు వచ్చాక స్పందించడం కంటే ముందే నగరాలను సిద్ధం చేయాలని అన్నారు. విపత్తు వేళ ప్రతి ప్రభుత్వ శాఖ బాధ్యతలు స్పష్టంగా ఉండేలా కొత్త చట్టంలో ప్రత్యేక నిబంధనలు రూపొందించామన్నారు.

## ప్రధాని మోదీతో నేడు జిన్‌పింగ్ భేటీ..




**అక్షరటుడే, ఢిల్లీ :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఢిల్లీలో జరుగుతున్న బ్రిక్స్ సదస్సు సందర్భంగా ఒక కీలక సమావేశం నిర్వహించనున్నారు. ఈ ఇద్దరు నాయకులు సరిహద్దు, రక్షణ, భద్రత, వాణిజ్యం, పెట్టుబడులు, వీసాలు, విమాన సర్వీసులు వంటి అంశాలపై చర్చించే అవకాశం ఉంది. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ శనివారం బీజింగ్ నుంచి బయలుదేరి న్యూఢిల్లీకి చేరుకున్నారు. ఏడేళ్ల తర్వాత జిన్‌పింగ్ భారతదేశంలో పర్యటిస్తున్నారు.

## బ్రిక్స్ సమ్మిట్ ప్రారంభం..

**అక్షరటుడే, ఢిల్లీ :** ఢిల్లీలోని భారత్ మండలంలో బ్రిక్స్ సమ్మిట్ శనివారం మధ్యాహ్నం ప్రారంభం అయింది. తొలి రోజు 11 సభ్య దేశాధినేతల సమావేశం నిర్వహించారు. బ్రిక్స్ సదస్సు తొలిరోజు భారత్ కీలక విజయం సాధించింది. అన్ని సభ్య దేశాలను ఒక ఉమ్మడి ప్రకటనకు అంగీకరించేలా చేసింది. బ్రిక్స్ సదస్సుకు భారత్ అధ్యక్షత వహిస్తున్న తరుణంలో, ఈ కూటమి ఒక ఉమ్మడి ప్రకటనకు అంగీకరించడం ఒక కీలక పరిణామం. శనివారం సాయంత్రం 'బ్రిక్స్ న్యూఢిల్లీ డిక్లరేషన్' వెలువడే అవకాశం ఉంది. పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధం నేపథ్యంలో 'బ్రిక్స్ న్యూఢిల్లీ డిక్లరేషన్' ఏ దేశం పేరునూ ప్రస్తావించకుండానే అన్ని రకాల దురాక్రమణ చర్యలను ఖండించనుంది.




## యూట్యూబర్ రమానందనకు షాక్

**అక్షరటుడే, ఏపీ :** యూట్యూబర్ ‘నందూస్ వరల్డ్’ నందనకు మరో షాక్ తగిలింది. ఉద్యోగాలిప్పిస్తామంటూ కన్సల్టెన్సీ ద్వారా డబ్బులు వసూలు చేసిన కేసులో అద్దంకి పోలీసులు నోటీసులు జారీ చేశారు. ఏపీలోని అద్దంకి మండలానికి చెందిన ఉప్పలపాటి శ్రీనివాసరావు తన కోడలికి యూకేలో ఉద్యోగం నిమిత్తం.. గుంటూరులో ప్రైవేటు కన్సల్టెన్సీ నిర్వహిస్తున్న రమానందన మామ మోహనరావును 2023లో సంప్రదించారు. ఈ నేపథ్యంలో అడ్వాన్స్ కింద రూ.లక్ష చెల్లించారు. అన్నిరకాల పత్రాలు పూర్తిచేసిన అనంతరం మరో రూ. 9.60 లక్షలు ఇచ్చారు. డబ్బులు చెల్లించడంతో ప్రాసెస్ పూర్తి చేసినా అటు ఉద్యోగం రాక.. ఇటు చెల్లించిన నగదు వాపసు చేయకపోవడంతో బాధితుడు ఈ ఏడాది జూన్‌లో అద్దంకి ఠాణాలో ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులకు కేసు నమోదు చేశారు.

## కళాకారులను ఆదుకోవాలి : ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్

**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ :** తెలంగాణ ఉద్యమానికి ఊపిరి పోసిన పేదింటి కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ కోరారు. సాంస్కృతిక వారధిలోని 582 మంది ఉద్యమ కళాకారులకు శాశ్వత సర్వీస్ రూల్స్, పీఆర్సీ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలన్నారు. పేద కళాకారుల కోసం వెంటనే హెల్త్ కార్డులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాల్లో మిగిలిపోయిన అర్హులైన ఉద్యమ కళాకారుల కోసం మరో 500 పోస్టులు సృష్టించి ఉద్యోగావకాశాలు కల్పించాలని కోరారు.





## మాజీ ఎంపీ ఫోన్‌లో పోర్న్ వీడియోలు

**అక్షరటుడే, బెంగళూరు :** జైలులో మాజీ జనతా దళ్ (సెక్యులర్) ఎంపీ ప్రజ్వల్ రేవన్నా నుంచి స్వాధీనం చేసుకున్న మొబైల్ ఫోన్, ఇతర పరికరాలలో డజన్ల కొద్దీ పోర్న్ వీడియోలు ఉన్నట్లు ఫోరెన్సిక్ విశ్లేషణలో వెల్లడైంది. గత నెలలో క్రైమ్ బ్రాంచ్ అధికారులు జరిపిన సోదాల్లో రేవన్నా తన జైలు గదిలో మొబైల్ ఫోన్ వాడుతూ దొరికాడు. మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడ మనవడు, కేంద్ర మంత్రి కుమారస్వామి మేనల్లుడు అయిన రేవన్నా, అత్యాచారం కేసులో దోషిగా తేలి యావజ్జీవ కారాగార శిక్ష అనుభవిస్తున్నాడు. అతను బెంగళూరులోని పరప్పన అగ్రహార సెంట్రల్ జైలులో ఉన్నాడు. గత నెల 11న క్రైమ్ బ్రాంచ్ అధికారులు జరిపిన సోదాల్లో రేవన్నా మొబైల్ ఫోన్ వాడుతున్నట్లు గుర్తించారు.

## విమోచన దినోత్సవం నిర్వహించాలి

**అక్షరటుడే, నాంపల్లి:** తెలంగాణ విమోచన పోరాటంలో ఎందరో అనామక జాతీయవాదులు కీలక పాత్ర పోషించారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామ్‌చందర్‌రావు అన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో వారికి నివాళులు అర్పించారు. ఓటు బ్యాంకు ఒత్తిళ్లకు లోనై, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు తెలంగాణ విమోచన దినోత్సవాన్ని జరుపుకోవడానికి నిరాకరించడం సిగ్గుచేటన్నారు. విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు.

